# 10. ప్రేమ

వారు ప్రేమను గూర్చి మాట్లాడసాగారు. వాదోపవాదాలు చెలరేగి, మానవజీవితంలో నిజంగా ప్రేమించట మనేది ఒకసారే సంభవమా, ఎన్ని సార్లయినా సంభవమా అనే మామూలు సమస్యలోకి దిగింది. ఒక్కసారే గాఢంగా ప్రేమించగలిగినవారి ఉదాహరణలూ, అనేకసార్లు గాఢంగా ప్రేమించగలిగినవాళ్ళ ఉదాహరణలూ కూడా చూపబడసాగినయ్. పురుషులు ప్రేమకు బానిసలై మధురగీతికలాగు గిరికీలుకొడుతూ, తమ ప్రేమకు ఏదన్నా అడ్డు తగులుతే ప్రాణత్యాగానికైనా వెనుదీయరని - పురుషుల వాదం. స్త్రీలు దీన్ని సూటిగా ఖండించకపోయినా, పురుషులు జాగర్తగా ఆలోచించకపోవటంవల్ల వారు గుడ్డిగా ప్రేమకోసం వెతుకులాడుతారనీ, ఆ మొట్టమొదటి ప్రేమే స్థిరమైనదనీ సత్యమైనదనీ, మానవులందరూ 'ప్రేమ'కు ఒక్కసారే జీవితంలో అర్హతను సంపాయించు కుంటారనీ - స్త్రీల వాదం. ఈ ప్రేమ ఒక పిడుగులాగు హృదయాన్ని తాకి, చెడుకల లాగు హృదయాన్ని బీభత్సపరిచేదని స్త్రీల అభిప్రాయం.

వీరికి ఆతిథ్యాన్నిచ్చిన లక్ష్మీపుత్రుడు లోగడ చాలా 'ప్రేమ'ను చూసినవాడు. ఆయన అన్నాడు, "ఒకరు మొట్టమొదట ప్రేమించినంత గాఢంగా - ఆత్మతో, హృదయంతో మళ్ళీ మళ్ళీ ప్రేమించగలరు. కాని దీనికి విరుద్ధంగా - ఒకసారి ప్రేమించి నిరాశజెంది, ఇంకో ప్రేమకు మళ్ళీ ఆ హృదయంలో తావులేదని సూచించేందుకని ఆత్మహత్య చేసుకున్న వారి ఉదాహరణల్ని మీరు చూపవచ్చు. దీనికి నా సమాధానం ఇది: వారు బుద్ధిహీనతతో ఆత్మహత్యకు గురికాకుండా ఉన్నట్టయితే మళ్ళీ జీవితంలో తప్పకుండా కాలుజారేవాళ్ళు. జీవితాంతం వరకూ ఆ మొదటితప్పునే అనేకసార్లు చేసి ఉండేవాళ్ళు. తాగుబోతుల్లో మనమేం చూస్తామో, ప్రేమికుల్లో కూడా

దాన్నే చూస్తాం. మొదటిసారి తాగినవాడు మళ్ళీ తాగుతాడు. అలాగే మొదటిసారి ఎంత ప్రకృతిసిద్ధంగా గాఢంగా ప్రేమించాడో, రెండోసారి కూడా అంతే! ఇది అవకాశాల్ని బట్టీ నిగ్రహశక్తినిబట్టీ కొద్దిగా మారుతూండవచ్చు-"

అతిథుల్లో మిగతావారు - డాక్టరు అభిప్రాయమిమ్మని అడిగారు. డాక్టరు యీ పల్లెపట్టునే తన వెంట్రుకల్ని నెరియ జేసుకున్నాడు. అతని అభిప్రాయం - పై అభిప్రాయంతో సరిపడ్డది. ప్రేమ నిగ్రహం మీదా, అవకాశం మీదనే ఆధారపడి వుంటుంది.

డాక్టర్ అన్నాడు: "నాకు తెలిసినంత వరకూ - ఒకే ఒక్క ప్రేమగాధ ఒక్కనాడు కూడా తన శక్తిని పోగొట్టుకోకుండా, యాభై ఐదేళ్ళు పెరిగి స్వాభావికమైన చావుతో మాత్రమే అంతమొందింది-"

"ఇది బాగుంది ... కల్లోనైనా అంత ప్రేమను చూడగలమా? గాఢమై దినదినాభివృద్ధయ్యే సజీవ ప్రేమకు పాత్రులౌతూ యాభై ఐదేళ్ళు బతకటంలో ఎంతసౌఖ్యం వుంది! అలాటి ప్రేమచేత పూజింపబడే వ్యక్తి ఎంత ఆనందించి వుంటుందో!" అంది ఒకామె.

డాక్టర్ నవ్వాడు! "కాని మీరు పొరపడ్డారు. ఆ ప్రేమించింది పురుషడనుకొని మీరు మాట్లాడుతూన్నట్టుంది. కాని, ఆ ప్రేమించబడ్డది పురుషుడు - ఎవరో కాదు - మన ఊర్లోని మందులషాపు యజమాని జాన్. ఆ స్త్రీని కూడా మీరు ఎరిగే ఉంటారు. ఫేముకుర్చీల్ని అల్లుతూ, పాతకుర్చీల్ని బాగుచేస్తూ, ప్రతి సంవత్సరమూ యీ ఊరువచ్చి - విరిగిన కుర్చీల మరామ్మత్తుకోసం ఇంటింటికీ తిరుగులాడే - ఆమె! కాని యీ విషయాన్ని మీకు అర్థమయ్యేట్టు ఎలా చెప్పేదీ!"

ఈ మాటలతో స్త్రీల ఆతృత చాలావరకు తగ్గింది. 'ప్రేమ' అనేది నాగరికత తెలిసిన, సాంఘిక గౌరవంగల వ్యక్తుల సొమ్మే నన్నట్టూ, నీచవ్యక్తుల పాలిటికి ఆ 'ప్రేమ' వెళ్ళేటంత చెడువస్తువు కాదన్నట్టూ, వారి ముఖాలు విసుగుదలతో కూడిన హేయభావాన్ని సూచించినయ్.

డాక్టర్ మళ్ళీ అందుకున్నాడు: మూడునెల్లక్రితం ఆమె నాకు కబురంపితే వెళ్ళాను. అప్పటికి ఆమె చావసిద్ధంగా వుంది. తన నివాసంగా ఏర్పరుచుకున్న ఆ పాతబండిలో ఆమె అప్పుడప్పుడు ఇటు వస్తూండేది. ఎముకలు బైటపడ్డ ఆ గుర్రమూ, ఒక నల్లకుక్కా ఆమె సేవకులు! నేను అక్కడికి వెళ్ళేప్పటికి, మృత్యువు ఆహ్వానించేందుకు పూర్వం జరగాల్సిన పవిత్ర కర్మకాండతో మతగురువు సిద్ధంగా ఉన్నాడు. ఆమె జీవితాంతాన ఇవ్వబొయ్యే వీలునామాకు మేమిద్దరమే సాక్షులం. తన ఇష్టాయిష్టాల్ని వీలునామాలో రాయబొయ్యే ముందు ఆమె తన కథను చెప్పింది. ఆ కథ లాగున నన్ను బాధించి, ఆలోచింప జేసింది - ఇంకోటి యీ లోకంలో లేదు.

ఆమె తల్లిదండ్రులు ప్రేముకుర్చీల్ని అల్లి, బాగుచేసేవాళ్ళు. ఆమె కూడా మొదటినుంచీ ఆ పనిలోనే తరిఫీదయింది. ఈ గోళంలో ఆమె ఎన్నడూ, ఎక్కడా స్థిరనివాసాన్ని ఏర్పరచుకోలేదు. ఆమె బాల్యంలో మురికితో చిరిగినగుడ్డల్ని ధరించి ఊరూరా తిరుగుతూండేది. రాత్రులు మాత్రం ఆ కుటుంబం ఊరిబైట రోడ్డుపక్కన ఆగేవాళ్ళు. ఆ అలసిన గుర్రాలకి అప్పుడు విశ్రాంతి దొరికేది. కుక్క తన గోళ్ళను ముక్కు దగ్గరకు లాక్కొని ముడుచుకు పడుకునేది...పగటిపూట యీ పిల్ల గడ్డిలో కుక్కతో ఆడుకుంటూండగా ఆమె తల్లిదండ్రులు, రోడ్డుపక్కన పెరిగిన చెట్ల ఛాయల కింద కూర్చొని, ఆ పక్క గ్రామంలో పోగుచేసుకొచ్చిన పాతకుర్చీల్ని బాగుచెయ్యటంలో నిమగ్ను లయ్యేవాళ్లు. వారి యీ నివాసంలో ఒకరితో ఒకరు హాయిగా, స్వేచ్ఛగా ఎన్నడూ మాట్లాడి ఎరుగరు. కుర్చీలు పోగుచేసుకొచ్చేందుకు ఒకరు ఊరి మీదికి వెళ్ళగానే మిగతా ఇద్దరూ తమ పనికి ఉపక్రమించేవారు.

ఈ పిల్ల ఊళ్ళో చాలాదూరం వెళ్ళినా, లేక ఏ చిన్న స్నేహితుడితో నన్నా మాట్లాడుతున్నా, ఆమె తండ్రి కేక వేసేవాడు: "ఇంటికి రా - మొద్దు!" ఇంతకన్న దయామయమైన మాటలు ఆమె చెవిన పడేవి కాదు.

ఆమె కాస్త పెద్దదయ్యాక ఊళ్ళోని పాతకుర్చీల్ని పోగుచేసుకురావటం ఆమె వంతయింది. ఈ సందర్భంలో వీధుల్లో ఆడుకునే కొంతమంది కుర్రాళ్ళతో ఆమెకు పరిచయం కూడా కలుగుతూండేది. ఇప్పుడు ఆ కేక వెయ్యటం కుర్రాళ్ళ తండ్రుల వంతయింది.

"ఇక్కడికి వచ్చావా - మురికిముండా! ఈ సారి మా వాడితో మాట్లాడు - నీ భరతం పడతాను-" అనేవాళ్ళు.

ఆమెమీద రాళ్ళురువ్వటం కుర్రాళ్ళకు అప్పుడప్పుడు సరదాగా ఉండేది. ఒక్కోసారి స్త్రీలు ఆమెకు డబ్బులిచ్చి ఏడిపిస్తూండేవాళ్లు.

ఆమె పదకొండో ఏట - ఒకనాడు యీ వూళ్ళోని చర్చ్ పక్కగా వెళ్తూ - రెండుఅణాలు పోగొట్టుకొని జాన్ ఏడుస్తూండటాన్ని గమనించింది. ఈ లక్ష్మీపుత్రుడు - తృప్తిగా, హాయిగా బతికే జీవి. ఇలా ఏడుస్తూండటం...వారి సేవకై జన్మించిందని నమ్మిన ఆమెను చాలా బాధించింది. అతన్ని లాలించి అతని దుఃఖానికి కారణం తెలుసుకొని ఆమె అతన్ని సంతోషపెట్టేందుకు ఏడు అణాల్ని - తన సర్వస్వాన్నీ అతని చేతుల్లోకి ధారపోసింది. జాన్ వాటిని తీసుకొని తన కన్నీటిని ఎండబెట్టుకున్నాడు. ఇదిచూసి ఆమె సంతోషంతో మైమరచి అతన్ని కావిలించుకుంది. తన చేతుల్లోపడ్డ నాణాల్ని జాగర్తగా లెక్కపెట్టుకుంటూ, జాన్ ఆమెను యీ పని చెయ్యనిచ్చాడు. విదిలింపబడకుండానూ, ఆటంకపరచకుండానూ ఉండటాన్ని చూసి, ఆమె ఆ పనిని మళ్ళీ మళ్ళీ చేసింది. ఆమె తన చేతుల్తోనే కాకుండా, హృదయంతో కూడా అతన్ని కావిలించుకొని, సంతోషంతో పరుగెత్తింది.

ఆమె నిర్భాగ్యపుతలపుల్లో ఏఏ మార్పులు జరిగివుంటయ్యో? ఈ దేశాటనంలో కష్టపడి సంపాయించిన తన భాగ్యాన్నంతట్నీ త్యాగం చేసిందని, తనకూ అతనికీ మధ్య తెగని సంబంధమేదో ఏర్పడిందని తలిచిందా! లేక తన మొట్టమొదటి కౌగిలినీ, ముద్దునూ యీ కుర్రాడికిచ్చే తన ప్రేమ నంతట్నీ అతనికే అంకితం చేసిందని భ్రమపడ్డదా? ఈ రహస్యం పిన్నలకూ, పెద్దలకూ కూడా ఒకే విధంగా వుంది. ఆ నాటినుంచీ నెలల తరబడి - ఆ చర్చ్ మూలన, ఆ కుర్రాణ్ణే గూర్చి అనేక కమ్మని కలల్ని కన్నది. అతన్ని మళ్ళీ చూడాలనే ఆశతో, తన తల్లిదండ్రులదగ్గరే దొంగగా బజారువస్తువుల్ని కొనేందుకు వెళ్ళినప్పుడూ, కూలిడబ్బులు వసూలు చేసేందుకు వెళ్ళినప్పుడూ - అణాలు అణాలుగా కూడబెట్టసాగింది. ఈ విధంగా మరుసటి సంవత్సరం ఆమె యీ వూరు వచ్చేప్పటికి రెండు రూపాయల్ని కూడబెట్ట గలిగింది. కాని కుర్రాడు మాత్రం యీసారి చర్చ్‌మూలన దొరకలేదు. తనతండ్రి మందులషాపులో రంగు అద్దాల వెనుక నిలబడివున్నాడు. అతను అక్కడ వుండగా ఆమె అతన్ని మరింతగా ప్రేమించ సాగింది. ఆ మెరిసే రంగు అద్దాలవెనుక అతన్ని మరింత ఆకర్షణ గలవాడిగా చిత్రించుకొని, తన్మయత జెందసాగింది.

ఆ దృశ్యం ఆమెకు మరుపురానిదైంది. మరుసంవత్సరం అతను స్కూలు వెనుక గోలీలు ఆడుతూండగా చూసి - అతని మీదపడి, తన చేతుల్లో అతన్ని బంధించి, ఉద్రేకంతో అతన్ని అనేకసార్లు ముద్దాడింది. జాన్‌కు భయమేసి మూలిగాడు. అతనిబాధను పోగొట్టేందుకు ఆమె సంపాదనంతట్నీ తొమ్మిదిరూపాయిల చిల్లర్ను యిచ్చింది. ఆ నాణాల్ని చూసి అతని కళ్ళు సంతోషంతో పెద్దవయినయ్. ఆ డబ్బు తీసుకున్నాక - ఆమెకు తృప్తి కలిగేదాకా అతనామెను అభ్యంతర పెట్టలేదు.

తరువాత నాలుగు సంవత్సరాలూ - ఆమె తన సంపాద నంతట్నీ సంవత్సరాంతాన అతనికే ముట్టజెప్పింది. దీనికి మారుగా ఆమె తనను ముద్దు పెట్టుకునేందుకు మాత్రం అతను అనుమతించాడు. ఆ మొత్తం ఒక్కొక్కసారి ఎక్కువ గానూ ఉండేది. కలసిరాని సంవత్సరంలో చిన్న మొత్తాన్ని ఇవ్వాల్సివచ్చినందుకు ఆమె జాలిగా, బాధగా ఏడ్చేది. చివరిసారి ఆమె యాభై రూపాయల దాకా బహూకరించినప్పుడు అతను తృప్తిగా, పెద్దగా నవ్వాడు.

ఆమె ఆలోచనలన్నీ అతన్ని గూర్చే, అతను ఆమె రాక కోసం వేచి కూర్చొని ఆమె కనిపించగానే ఆమెవైపు పరుగెత్తేవాడు. ఇదిచూసి ఆమె హృదయం సంతోషంతో ఉప్పొంగేది.

తరువాత అతను ఆమెకు కనబడలేదు. అతని తల్లిదండ్రులు అతన్ని కాలేజికి పట్టణానికి పంపారు. ఈ సంగతి ఆమె తన తెలివితేటల్ని ఉపయోగించి ఎలాగో తెలుసుకోగలిగింది. అప్పటినుంచీ ఆమె తల్లిదండ్రుల్తో పోట్లాడి, వారిని ఒప్పించో,

నొప్పించో – సరిగ్గా కాలేజీ శెలవలిచ్చే నాటికి యీ గ్రామం గుండా వెళ్ళే ప్రయత్నాల్ని చేయించేది. కాని యీ పనిలో ఒమె ఒక్క సంవత్సరం మాత్రమే జయము పొంద గలిగింది. తరువాత, రెండు సంవత్సరాలపాటు ఆమె అతన్ని చూడనేలేదు. మూడో సంవత్సరంలో అతను పూర్తిగా మారిపోవటంవల్ల అతన్ని గుర్తించటమే ఆమెకు కష్టమైంది. బాగా పెరిగి పెద్దదైన అందమైన అతని విగ్రహమూ, అతను ధరించిన విలువైన కోటు మీది ఇత్తడి గుండీల ధగధగలూ – ఆమె కెంతో సంతోషాన్నిచ్చినయ్. కాని అతను మాత్రం ఆమెను లెక్క చెయ్యకుండానే గర్వంతో కూడిన పై చూపుతో ఆమె పక్కగా నడిచి వెళ్ళి పొయ్యాడు. ఇది తలుచుకొని ఆమె రెండు రోజులపాటు ఒంటరిగా కూర్చుని ఏడ్చింది. తరువాత హృదయంలోని బాధతో నిశ్శబ్దంగా బాధపడసాగింది.

ప్రతి సంవత్సరమూ ఆమె ఇక్కడికి వచ్చేది. అతను ఎదురైతే నమస్క రించేందుక్కూడా ఆమె భయపడేది. అసలు అతను కన్నెత్తి ఆమెను చూసేవాడే కాదు.

ఆమె అతన్ని గాఢంగా ప్రేమించిందనేందుకు సందేహం లేదు. ఆమె నాతో అంది: "డాక్టర్‌గారూ! నేను యీ భూమిమీద చూసిన పురుషుడు అతనొక్కడే! ఇన్నాళ్ళూ ఇతర పురుషులింకా బ్రతికివున్నారనేమాటే నాకు తోచలేదు."

ఆమె తల్లిదండ్రులు గతించారు. ఆమె వారి వ్యాపారంలోనే ప్రవేశించింది. ఒక కుక్కకు బదులు భయంకరమైన రెండు కుక్కల్ని ఆమె దగ్గర ఉంచుకునేది.

తన హృదయాన్నంతట్నీ ఆవరించుకున్న యీ ప్రదేశానికి ఆమె ఒకనాడు వచ్చింది. మందులషాపులో ఒక యువతి, అందమైన యువకుడి భుజాలమీద ఆని ఉండటాన్ని చూసింది. ఆమె అతని భార్య!

ఆ సాయింత్రం ఆమె మందులషాపుకు ఎదురుగావున్న చెరువులో దూకింది. ఒకడు ఆమెను రక్షించి ప్రథమచికిత్స కోసం మందులషాపుకు తీసుకువెళ్ళాడు. జాన్ ఆమెకు ప్రథమచికిత్స చేసేందుకు వచ్చి, ఆమెను గుర్తించనట్టుగానే నటిస్తూ, చికిత్స ప్రారంభించి కఠినమైన స్వరంతో, "బుద్ధిలేని పశువులాగు ప్రవర్తించాల్సిన అవసరం – నాకేమీ కనిపించటంలేదు–" అన్నాడు.

ఆమె వ్యాధి కుదిరేందుకు అది చాలు. అతను తనతో మాట్లాడాడు!

ఇది తలుచుకుంటూ ఆమె చాలాకాలం హాయిగా బతక గలిగింది. తను చేసిన చికిత్సకు అతను ప్రతిఫలం కోరలేదు. కాని ఆమె బలవంతాన అతనికి బాగా డబ్బిచ్చింది. ఇలాగే ఆమె జీవితం క్రమంగా గడవసాగింది. జాన్‌ను తలుచుకుంటూ ఆమె ఉత్సాహంతో పనిచేసేది. ప్రతి సంవత్సరమూ ఆ పెద్ద అద్దాల వెనుక అతన్నిచూసేది. ఆమె తనకు కావాల్సిన మందులన్నింటినీ ఎక్కువ ఖరీదుతో అక్కడే

కొనేది. ఈ సమయంలో అతన్ని దగ్గర్లోచూసి, మాట్లాడి, తృప్తితో ఎక్కువ డబ్బిచ్చే అవకాశాన్ని ఏర్పరచుకునేది.

ఆమె కిందటి సంవత్సరమే చనిపోయింది. తన యీ దీనగాధను చెప్పాక - తన జీవితంలో అతిజాగర్తతో కూడబెట్టిన తన కష్టాన్నంతట్నీ అతని కిమ్మని నన్ను ప్రార్థించింది. జీవితంలో అతని కోసమే కష్టపడి పనిచేస్తూ, అతని కోసం మరింత కూడబెట్టవచ్చనే ఆశతో ఒక్కొకప్పుడు ఉపవాసాలు కూడా చేస్తూ - ఆమె డబ్బు కూడబెట్టింది. తను మరణించాక, అతను తన్ను గూర్చి ఒక్కసారన్నా తలుస్తాడనే నమ్మకం ఆమెకు కలిగింది - అదే ఆమె జీవితానికంతటికీ కోరిన కోర్కె!

ఆమె నాకు రెండువేల మూడువందల ఇరవై ఏడురూపాయిల్ని ఇచ్చింది. ఆమె అంత్యక్రియ కోసం ఇరవైఏడురూపాయిల్ని మాత్రం ఖర్చుపెట్టి, మిగతా సొమ్ముతో మర్నాడు జాన్ ఇంటికి వెళ్ళాను. ఆ దంపతులు అప్పుడే భోజనం చేసి, ఒకరికొకరు ఎదురుగా కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. నన్ను చూసి, గౌరవంగా ఒక కుర్చీ చూపారు.

వారు బాగా బాధపడతారని, యీ కథను ఉద్రేకమైన కంఠంతో వారికి చెప్పాను. ఈ కర్షకురాలిచేత, బజారుపిల్ల చేత, మురికిముండచేత తను ప్రేమించబడ్డాడని తెలుసుకోగానే - తన మర్యాదనంతట్నీ ఆమె దొంగిలించినట్టు - ప్రాణంకన్న ఎక్కువగా చూసుకునే తన మృదుత్వాన్నంతట్నీ ఆమె అపహరించినట్టు - కుర్చీలోనే జాన్ ఎగిరిపడ్డాడు. ఆతని భార్య కూడా చీదరించుకుంటూ, ఇంకో మాటేమీ దొరకనట్టు, మాటిమాటికీ, "అడుక్కుతినేముండ!" అంటూనే వుంది.

అతను మండిపడుతూ, పెద్దపెద్ద అంగలు వేస్తూ, కాలు కాలినపిల్లిలాగు హాలంతా తిరగసాగాడు. అతని పెద్దటోపీ చెవులదాకా దిగజారింది. కోపంతో బుసలుకొడుతూ అతను గొణిగాడు: "మీరు కనీసం ఊహించండి - డాక్టర్‌గారూ! ఇంతకన్న అన్యాయం నాకు జరుగుతుందా? ఇప్పుడేం చేసేట్టు? ఈ సంగతి ఆమె బతికి ఉండగానే నాకు తెలిసినట్టయితే - వెంటనే ఆమెను జైలుకు పంపేవాణ్ని. ఆమె మృత్యువుతోపాటే నన్ను మరిచిపొయ్యేవరకూ అక్కడే ఉండేట్టు చేసి తీరేవాణ్ని."

ఈ పవిత్ర ప్రేమగాధకు వచ్చిన ఫలితాన్ని చూస్తే నాకు ఆశ్చర్యమే అయింది.

ఏం చెయ్యాలో, ఏం మాట్లాడాలో నాకు అర్థమవలేదు. ఏమైనా నాపని పూర్తి చేసుకోవాల్సిన బాధ్యత నాకు వుంది.

అన్నాను. "ఆమె తుది కోర్కెగా కోరింది, తన జీవితానికంతకూ కష్టపడి సంపాయించిన రెండువేల మూడువందల రూపాయిల్నీ మీకిమ్మని. ఇప్పుడు నేను చెప్పింది మీ గౌరవ మర్యాదలకు నష్టదాయకమైందిగా కనిపిస్తోంది కనుక, యీ డబ్బును బీదసాదలకు పంచిపెట్టటం మంచిదనుకుంటాను-" ఈ మాటలు బాగా

గుచ్చుకున్నట్టుగా వారు నా వైపు చూశారు. వారి ఆశ్చర్యాన్నిచూసి - ఆమె అతి బాధతో గడిపే ఆ నిర్భాగ్య జీవితంలోనే దేశంలోని అన్ని మూలలనుంచీ, అనేకమందికి సపర్యలుచేసి సంపాయించిన - ఆ రకరకాల నాణాల మొత్తాన్ని తీసి బల్లమీదపెడుతూ, "మీరేం నిశ్చయించుకున్నారు?" అని అడిగాను.

అతని భార్యే ముందు మాట్లాడింది. "...కాని ఇది ఆమె తుదికోర్కె కనుక, దీనిని నిరాకరించటం న్యాయమని తోచదు-"

జాన్ కాస్త గల్లంతుపడి, "మా పిల్లలకు ఏమన్నా కొనేందుకు ఆ డబ్బును ఉపయోగిస్తాం-" అన్నాడు.

నేను, "మీ ఇష్టం-" అన్నాను కఠినంగా.

అతను అన్నాడు: "అంతే! మిమ్ము తన అంత్యకోర్కెను తీర్చమని కోరింది కనుక ఆ పైకం మా కివ్వండి. ఏదన్నా సద్వినియోగం చేసేందుకు ప్రయత్నిస్తాం-"

ఆ పైకాన్ని ఇచ్చేసి, నేను ఇంటికి వెళ్ళాను. మర్నాడు జాన్ నాదగ్గరకు వచ్చి, "ఆమెకొక బండీ వుండాలి, దాన్ని కూడా ఇక్కడే వదలి వెళ్ళినదనుకుంటాను - మీరు దాంతో ఏం చేస్తారు?" అని అడిగాడు.

"నాకదేమీ ఉపయోగంలేదు; కావాలంటే మీరు తీసుకోండి-"

"కట్టెల్ని పెట్టుకునేందుకు అది ఉపయోగపడేట్టుంది-" అన్నాడు జాన్.

అతను వెళ్ళిపోతూండగా అతన్ని పిలిచి, "ఆమె ఒక ముసలిగుర్రాన్నీ, రెండు కుక్కల్నీ కూడా వదలివెళ్ళింది; మీకు కావాలా?" అని అడిగాను.

అతను ఆశ్చర్యంతో కాస్సేపు అలాగే నిలబడి, "ఉహు అవి నా కెందుకు? వీలైతే వాటిని అమ్మేయ్యండి-" అని పెద్దగానవ్వి, నమస్కరించి వెళ్ళిపొయ్యాడు. నేను అంతకన్న ఏం చెయ్యను! పల్లెటూర్లో డాక్టరూ, మందులషాపువాడూ విరోధులైతే ప్రమాదం తప్పదు! ఆ కుక్కల్ని నేనే ఉంచుకున్నాను. ముసలిగుర్రాన్ని - మతగురువు తన పెద్ద పొలంమీదికి తీసుకువెళ్ళాడు. ఆ బండీ జాన్‌కు కట్టెలకొట్టుగా ఉపయోగపడ్డది....ఆమె ఇచ్చివెళ్ళిన పైకంతో అతను రైల్వేకంపెనీలో ఐదుభాగాల్ని కొన్నాడు...ఇది నా జీవితంలో నేను ఎరిగినంతవరకూ సంభవించిన ప్రేమగాథ!"

డాక్టర్ కథ ముగించి నిశ్శబ్దంగా ఊరుకున్నాడు. ఆతిథ్యాన్నిచ్చిన లక్ష్మీపుత్రుడు - కన్నీళ్ళతోపాటే వెలువడ్డ నిట్టూర్పుతో అన్నాడు; "ప్రేమించటం తెలిసింది ఒక్క ఆడవాళ్ళకే! ఇది నిస్సందేహంగా - నిజం!"